TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 36 | 18-06-2026 గురువారం | పేజీలు: 08 | వెల: 3/-


## సింగరేణి బాయిబాటలో కార్మికుల మధ్య కవిత!!


03






# తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రానికి ఆదర్శం

- 27 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తిగా టీపీఎస్
- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల పాఠశాల ప్రారంభం
- విద్యా వ్యవస్థ ప్రక్షాళనకే విద్యా కమిషన్ ఏర్పాటు
- ప్రభుత్వ బడులపై ఉన్న అపోహలు తొలగించడమే లక్ష్యం
- అసమానతల నిర్మూలనకు నాణ్యమైన విద్యే మార్గమన్న సీఎం
- కుల ప్రాతిపదిక పాఠశాలలకు బదులు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- ప్రభుత్వ బడుల నుంచే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభం
- విద్యా కిట్ల టెండర్లపై అవినీతి ఆరోపణలను ఖండించిన సీఎం
- విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతామన్న రేవంత్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూ.15 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఆధునిక లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్ తదితర సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి, పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో విద్యార్థులతో సరదాగా ఫుట్‌బాల్ ఆడారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు రూ.27 వేల కోట్లు విద్యాశాఖపైనే ఖర్చు చేస్తున్నామని తెలిపారు. విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రుల్లో కొన్ని అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామని పేర్కొన్నారు. విద్య మాత్రమే వ్యక్తుల జీవితాలను సమూలంగా మార్చగల శక్తి కలిగిన సాధనమని, సమాజంలో అసమానతలు తొలగాలంటే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం నామోషీగా భావించే పరిస్థితులు మారాలని సీఎం అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ముఖ్యమంత్రులు వంటి ఉన్నత స్థానాలకు ఎదిగిన వ్యక్తులు ఉన్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం వర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశాలలను ఏర్పాటు చేసి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని విమర్శించారు. కుల విభజనలకు మిగతా 2లో..

# వచ్చేది మన ప్రభుత్వమే..

- మళ్లీ సీఎంగా కేసీఆర్ ఖాయం
- ఖమ్మం వేదికగా కేటీఆర్ వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ శ్రేణులకు కీలక దిశా నిర్దేశం
- సర్ ప్రక్రియపై ప్రతి బీఎల్ఏ అప్రమత్తంగా ఉండాలి
- ఖమ్మం జిల్లాలో 'ఘరానా దొంగల' పాలన సాగుతోంది
- ఒకరు కబ్జాల మంత్రి..
- మరొకరు అస్తవ్యస్త ఆర్థిక మంత్రి
- కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్ర ప్రగతే సజీవ సాక్ష్యం
- రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో లక్షల కోట్ల అప్పులు..
- రెవెన్యూ మంత్రి పొంగులేటిపై వీడియోల ప్రదర్శన
- సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని సూచన
- ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పార్టీ కేడర్‌లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఖమ్మం జిల్లాలో బుధవారం పర్యటించిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో (బీఎల్ఏ) కీలక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ముసుగులో సాగుతున్న ప్రజావ్యతిరేక పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో ముందస్తు ఎన్నికలు వచ్చినా, గడువు ప్రకారం ఎన్నికలు జరిగినా మళ్లీ అధికారంలోకి వచ్చేది కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా మిగతా 2లో..

# పవన్‌ను కలవాలన్న నిరంజన్ కోరిక నెరవేర్చిన జనసేనాని

- హనుమకొండలో అభిమాని ఇంటికి వెళ్లిన పవన్ కల్యాణ్
- అరుదైన వ్యాధితో పోరాడుతున్న బాలుడిని పరామర్శ
- నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం స్ఫూర్తిదాయకమన్న డిప్యూటీ సీఎం
- ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ప్రశంసనీయం
- త్వరగా కోలుకోవాలని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించిన పవన్
- భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్ష
- నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పదంటూ నిరంజన్‌కు భరోసా
- పూర్తి ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్ష
- సహకరించిన సీఎం రేవంత్, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- తెలంగాణ ప్రజల ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనివన్న పవన్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ హనుమకొండ జిల్లాలో అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న తన అభిమాని నిరంజన్(17)ను బుధవారం పరామర్శించారు. తనను ఒకసారి కలవాలన్న బాలుడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్ కల్యాణ్ స్వయంగా అతని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ఇటీవల నిరంజన్ తనను కలవాలనే కోరికను వ్యక్తం చేసిన వీడియోను చూసినట్లు పవన్ తెలిపారు. ఆ బాలుడి మిగతా 2లో..

# ఉస్మానియాలో ర్యాగింగ్ కలకలం

- 12 మంది సీనియర్ విద్యార్థులపై వేటు
- 6 నెలల పాటు కొనసాగనున్న సస్పెన్షన్
- డెంటల్ కాలేజ్ ప్రిన్సిపల్ సంచలన నిర్ణయం
- 12 మందిపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు
- జూన్ 9న జరిగిన ఫిర్యాదుతో బయటపడ్డ వ్యవహారం
- హెచ్చరించిన 24 గంటల్లోనే మళ్లీ రెచ్చిపోయిన సీనియర్లు
- మద్యం, సిగరెట్లు తెప్పించుకుంటూ జూనియర్లకు నరకం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ లోని ప్రముఖ ప్రభుత్వ ఉస్మానియా డెంటల్ కాలేజీలో తీవ్ర కలకలం రేపిన ర్యాగింగ్ ఉదంతంపై కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్ స్పందించారు. క్యాంపస్‌లో జూనియర్ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ నిబంధనలను అతిక్రమించిన 12 మంది ఫైనల్ ఇయర్, థర్డ్ ఇయర్ విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ క్రూరమైన ర్యాగింగ్ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను, సీనియర్ల ఆగడాలను ఆయన మీడియాకు వివరించారు. కాలేజీ వాతావరణాన్ని చెడగొట్టేలా ప్రవర్తించే వారిపై చట్టపరంగా, విద్యాపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా

# కరిక్యులం ఎంపిక రాష్ట్రాల హక్కు: కేరళ సీఎం

- పాఠశాల విద్యలో కేంద్ర జోక్యం ఉండకూడదన్న సతీశన్
- పీఎం శ్రీ పథకంపై అధ్యయనానికి ఉపకమిటీ ఏర్పాటు
- నలుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసిన కేరళ ప్రభుత్వం
- పథకం అమలుపై మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం
- పాఠశాలల ఎంపికలో రాష్ట్రానికే స్వేచ్ఛ ఉండాలని అభిప్రాయం
- విద్యా విధానాల అమలులో రాష్ట్రాల పాత్ర కీలకమన్న సీఎం
- పీఎం శ్రీ కింద రాష్ట్రానికి రూ.99 కోట్లు వచ్చినట్లు వెల్లడి



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

పాఠశాలల్లో అమలు చేసే కరిక్యులం ఎంపిక విషయంలో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ పేర్కొన్నారు. విద్యా విధానాల అమలులో మిగతా 2లో..

# జీ7 సదస్సులో మోదీ-మెలోని హల్చల్

- "ఇన్‌స్టాలో మనమే పాపులర్ జంట"
- మోదీపై ఇటలీ ప్రధాని సరదా వ్యాఖ్యలు
- ప్రపంచ సవాళ్లపై గర్జించిన దేశాధినేతలు
- సోషల్ మీడియాను ఊపేస్తున్న సరదా సంభాషణ
- "పొగ తాగడం మానేశా.. ఎవరినీ చంపాలని లేదు" మెలోని జోకులు
- అంతర్జాతీయ మాఫియా, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై జీ7 యుద్ధం
- జాతీయ భద్రతకు డ్రగ్స్ నెట్‌వర్క్ పెద్ద ముప్పు: సంయుక్త ప్రకటన
- బ్రెజిల్, దక్షిణ కొరియా మద్దతు..
- గ్లోబల్ సవాళ్లపై ఉమ్మడి పోరు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

అంతర్జాతీయ వేదిక జీ7 శిఖరాగ్ర సదస్సులో ఆసక్తికర దృశ్యాలు చోటుచేసుకున్నాయి. భారత్‌తో పాటు ప్రపంచ దేశాల మధ్య దౌత్య సంబంధాలు, వ్యూహాత్మక చర్చలతో పాటు ప్రపంచ నేతల మధ్య నడిచిన కొన్ని సరదా సంభాషణలు నెట్టింట మారుమోగుతున్నాయి. ముఖ్యంగా భారత మిగతా 2లో..

# ఓట్ల తొలగింపు వెనుక పెద్ద కుట్ర

- ముస్లింల ఓట్లే కేంద్రం టార్గెట్
- బెంగాల్, బిహార్ తరహాలోనే అక్రమాలు
- మీ ఓటును మీరే కాపాడుకోవాలి
- ప్రజలకు మంత్రి అజారుద్దీన్ పిలుపు
- గత ప్రభుత్వ పెండింగ్స్ క్లియర్..
- విద్యారంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ
- పేదల సమస్యల పరిష్కారమే లక్ష్యం..
- పబ్లిసిటీపై మోజు లేదన్న మంత్రి
- ప్రజల దరఖాస్తులపై తక్షణ చర్యలు




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాజకీయాల్లో ఓట్ల తొలగింపు వ్యవహారం కలకలం రేపుతోంది. ఓటర్ల జాబితా సవరణ లేదా 'సర్' ప్రక్రియ పేరుతో మైనార్టీల, ముఖ్యంగా ముస్లింల ఓట్లను పెద్ద ఎత్తున తొలగించేందుకు తెరవెనుక కుట్రలు జరుగుతున్నాయంటూ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం 'గాంధీభవన్'లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సర్' ప్రక్రియ అనేది అందరికీ వర్తించే సాధారణ అంశంలా కనిపించినప్పటికీ, దీని వెనుక కేవలం ముస్లిం ఓటర్లనే లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని కొన్ని మిగతా 2లో..

# ములుగు అడవుల్లో ఐటీ విప్లవం

- ఏజెన్సీ జిల్లాలో తొలి ప్రైవేట్ ఐటీ కంపెనీ ప్రారంభం..
- స్థానిక యువతకు వరంలా మారిన 'శ్రియా ఇన్ఫోటెక్'
- ఐటీ రంగంలో ములుగు ఏజెన్సీ సరికొత్త చరిత్ర
- నగరాలకే పరిమితం కాకుండా పల్లెలకూ ఐటీ సేవలు
- శ్రియా ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో యాప్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ
- స్థానిక అవసరాలు తీరుస్తూ 15 మందికి ఉద్యోగాలు
- ఆదిలాబాద్, కొత్తగూడెం ఏజెన్సీలకూ ఐటీ విస్తరించాలన్న సీతక్క
- పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రభుత్వ పూర్తి సహకారం
- వ్యవస్థాపకుడు రవికుమార్ రంగారి ముందడుగుకు అభినందనలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. దట్టమైన అడవులు, వెనుకబడిన ప్రాంతంగా ముద్రపడిన ములుగులో తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఒక ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సంస్థ కొలువుదీరింది. స్థానిక గ్రామీణ, గిరిజన యువతకు నగరాలకు వెళ్లే పనిలేకుండా, మిగతా 2లో..

# పవన్‌ను కలవాలన్న నిరంజన్ కోరిక నెరవేర్చిన జనసేనాని

మొదటిపేజీ తరువాయి

కోరికను నెరవేర్చాలనే ఉద్దేశంతో హనుమకొండ పర్యటన సందర్భంగా అతని ఇంటికి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పర్యటనకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నప్పటికీ అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నాడని పవన్ కొనియాడారు. తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూనే అతడు ప్రదర్శిస్తున్న మనోధైర్యం, జీవితంపై ఆశావహ దృక్పథం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే అతని సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు.
నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు పవన్ తెలిపారు. అలాగే భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు నిరంజన్‌పై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు. భగవంతుని కృపతో అతడు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. "ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను" అంటూ పవన్ కళ్యాణ్ భావోద్వేగ సందేశాన్ని ఇచ్చారు.
అదే సమయంలో తన వరంగల్, హనుమకొండ పర్యటన విజయవంతం కావడానికి సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు పవన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని పవన్ పేర్కొన్నారు. ప్రజలు తనపై చూపుతున్న మమకారాన్ని జీవితాంతం హృదయంలో నిలుపుకుంటానని తెలిపారు. హనుమకొండలో జరిగిన ఈ పరామర్శ కార్యక్రమం స్థానికంగా భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించగా, నిరంజన్ కుటుంబ సభ్యులు పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# జీ7 సదస్సులో మోదీమెలోని హల్చల్

మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల మధ్య జరిగిన ఒక ఆసక్తికరమైన చాటింగ్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. సదస్సుకు విచ్చేసిన ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికిన మెలోని, "ఇన్‌స్టాగ్రామ్‌లో మనమే అత్యంత ఫేమస్ జంట" అని నవ్వుతూ అనడం అక్కడున్న మైక్‌లో రికార్డైంది. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి, పరస్పర గౌరవానికి ఈ సరదా క్షణాలు అద్దం పడుతున్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కెనడా వేదికగా జరుగుతున్న జీ7 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల భేటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గత కొంత కాలంగా వీరిద్దరి మధ్య ఉన్న స్నేహపూర్వక దౌత్య సంబంధాలు అంతర్జాతీయంగా చర్చల్లో ఉంటున్నాయి. గతంలో మోదీ ఇటలీ వెళ్లినప్పుడు మెలోనికి ప్రత్యేకంగా 'మెలోడీ' టాఫీల ప్యాకెట్‌ను గిఫ్ట్‌గా ఇవ్వడం, అది కాస్తా 'మెలోడి' హ్యాష్ ట్యాగ్‌తో ట్రెండ్ అవ్వడం అందరికీ తెలిసిందే. తాజాగా ఈ సదస్సులో కూడా మెలోని హుషారుగా మోదీతో డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ గురించి మాట్లాడటం, ఆ వీడియో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్) వేదికలపై మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో దూసుకుపోతోంది.
సదస్సులో కేవలం రాజకీయాలే కాకుండా నేతల వ్యక్తిగత అలవాట్లపై కూడా ఆసక్తికరమైన చర్చ నడిచింది. తాను నెల రోజుల క్రితమే ధూమపానం (స్మోకింగ్) పూర్తిగా మానేశానని మెలోని ఇతర దేశాల నాయకులకు చెబుతుండగా, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్డోగాన్ స్పందిస్తూ, "మీరు చాలా బాగున్నారు.. కానీ ధూమపానాన్ని పూర్తిగా దూరం పెట్టాల్సిందే" అని సలహా ఇచ్చారు. దీనిపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ నవ్వుతూ, "అది అసాధ్యం" అనడంతో మెలోని తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. "నేను గనుక పొగ తాగడం మానేస్తే అంత కలివిడిగా ఉండలేకపోవచ్చు.. అయినా నా చేతుల్లో ఎవరూ చావడం నాకు ఇష్టం లేదు" అంటూ ఆమె నవ్వులు పూయించారు.
సరదా సంఘటనలు పక్కన పెడితే, ప్రపంచ భద్రతకు ముప్పుగా మారిన తీవ్రమైన అంశాలపై జీ7 నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా సాగుతున్న డ్రగ్స్ (మాదకద్రవ్యాలు) అక్రమ రవాణా, నల్లధనాన్ని తెల్లధనంగా మార్చే మనీలాండరింగ్ నెట్‌వర్క్‌లు, ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్స్ (వ్యవస్థీకృత నేరాలు) అడ్డుకోవడానికి ఉమ్మడి కార్యాచరణను ప్రకటించారు. సముద్ర మార్గాల్లో భద్రతను కట్టుదిట్టం చేయడం, నేర ముఠాలకు అందుతున్న ఆర్థిక వనరుల మూలాలను దెబ్బతీయడం, ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థల్లో నేరగాళ్లు చొరబడకుండా గట్టి నిఘా ఉంచడం వంటి కీలక అంశాలపై దేశాధినేతలు ఒక అవగాహనకు వచ్చారు. సదస్సు ముగింపులో జీ7 దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో మాదకద్రవ్యాల సరఫరాపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వ్యాపారం వేగంగా విస్తరించడం వల్ల వివిధ దేశాల జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థలు మరియు ప్రజాస్వామ్య వ్యవస్థల ఉనికికే ప్రమాదం వాటిల్లుతోందని హెచ్చరించారు. డ్రగ్ మాఫియాపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ రకమైన అక్రమ రవాణాను కేవలం ఒక దేశం అణచివేయలేదని, సరఫరా మరియు వినియోగం రెండింటినీ నియంత్రించేలా అన్ని దేశాలు సమగ్ర విధానంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# కరిక్యులం ఎంపిక రాష్ట్రాల హక్కు: కేరళ సీఎం

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని సమగ్రంగా పరిశీలించేందుకు నలుగురు మంత్రులతో కూడిన ఉపకమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.
తన అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం విలేకరులకు తెలిపారు. పీఎం శ్రీ పథకం అమలు, దాని ప్రభావం, రాష్ట్ర విద్యా విధానాలతో దాని అనుసంధానంపై ఉపకమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు.
ఈ పథకాన్ని అమలుచేసే పాఠశాలల ఎంపిక విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికే స్వేచ్ఛ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యా రంగానికి సంబంధించిన నిర్ణయాలు స్థానిక అవసరాలు, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను పరిమితం చేసే విధంగా ఎలాంటి నిబంధనలు ఉండకూడదన్నారు. పీఎం శ్రీ పథకం కింద కేరళకు రూ.99 కోట్ల నిధులు అందాయని సతీశన్ తెలిపారు. అయితే ఈ పథకానికి సంబంధించిన ఒప్పందం గత ప్రభుత్వ హయాంలోనే కుదిరిందని చెప్పారు. ఆ ఒప్పందం ఆధారంగానే కేంద్రం నుంచి నిధులు కూడా విడుదలయ్యాయని పేర్కొన్నారు.
గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ఇప్పటికే వచ్చిన నిధులను దృష్టిలో ఉంచుకుని అనివార్య పరిస్థితుల్లో ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని సీఎం వివరించారు. అయితే పథకం అమలు సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలు, విద్యా విధానాల స్వతంత్రతకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యారంగంలో రాష్ట్రాల హక్కులను పరిరక్షించడంలో కేరళ ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని సీఎం సతీశన్ పేర్కొన్నారు.

# వచ్చేది మన ప్రభుత్వమే..

మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.
మరికొద్ది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ లేదా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏ) అత్యంత అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ ఆదేశించారు. అధికార పార్టీ ఓటర్ల జాబితాలో తమకు అనుకూలంగా మార్పులు చేసుకునేందుకు, బీఆర్ఎస్ సానుభూతిపరుల ఓట్లను అక్రమంగా తొలగించేందుకు కుట్రలు చేసే ప్రమాదం ఉందన్నారు. అర్హత గల ఏ ఒక్క వ్యక్తి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి గ్రామంలో, ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో గ్రౌండ్ లెవెల్ వెరిఫికేషన్ చేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఖమ్మం జిల్లా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గజదొంగల పాలన నడుస్తుంటే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం ఘరానా దొంగల పాలన కొనసాగుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, ఖమ్మం ప్రజల ప్రయోజనాలను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. దాచుకోవడం, దోచుకోవడం తప్ప ఈ ముగ్గురు మంత్రులు జిల్లా అభివృద్ధికి పైసా పని కూడా చేయలేదని విమర్శించారు. కేవలం తమ స్వార్థ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసమే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.
ఖమ్మం జిల్లా మంత్రుల శాఖల పనితీరును కేటీఆర్ లెక్కలతో సహా ఎండగట్టారు. జిల్లాకు చెందిన ఒక మంత్రి పూర్తిగా భూముల కబ్జాలకే పరిమితమయ్యారని, పేదల భూములను అక్రమంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. మరోవైపు వ్యవసాయ శాఖను చూస్తున్న మంత్రి చేతగానితనం వల్ల నేడు తెలంగాణలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని, రైతులకు పెట్టుబడి సాయం అందక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాష్ట్ర ఆర్థిక మంత్రి తన అసమర్థ విధానాలతో తెలంగాణ ఆర్థిక పరిస్థితిని పూర్తిగా అస్తవ్యస్తం చేసి, జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి తెచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ అప్పులు చేశారంటూ నిరంతరం విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో చేసిన ప్రతి రూపాయి అప్పుకు తెలంగాణలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్ష్యంగా నిలిచిందన్నారు. కాళేశ్వరం లాంటి ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, అద్భుతమైన జాతీయ రహదారులు, ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు.. ఇవన్నీ కేసీఆర్ చేసిన అప్పులతోనే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. ఆ అప్పులు రాష్ట్ర సంపదను పెంచడానికి ఉపయోగపడ్డాయని స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం దేనికోసం లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తెచ్చిన నిధులను వాడుకుంటూ, కొత్తగా మళ్లీ అప్పుల కుప్పగా మార్చిన ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టునైనా నిర్మించిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన అప్పులన్నీ కేవలం వారి అవినీతి జేబుల్లోకి, ఢిల్లీకి మూటలుగా వెళ్లాయే తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.
రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యంగా కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. రెవెన్యూ శాఖను అడ్డం పెట్టుకుని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెద్ద ఎత్తున భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన పక్కా ఆధారాలు, వీడియో దృశ్యాలను ఖమ్మం సభా వేదికపైనే కేటీఆర్ ల్యాప్‌టాప్ ద్వారా స్క్రీన్‌లపై ప్రదర్శించి రచ్చ లేపారు. అధికార బలంతో విచ్చలవిడిగా సాగుతున్న ఈ అక్రమాలను న్యాయపరంగా, రాజకీయంగా ఎండగడతామని, బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పార్టీ బలోపేతం కోసం బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'డిజిటల్ సభ్యత్వ నమోదు' కార్యక్రమాన్ని జిల్లాలో ఉధృతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ ఆధునిక సభ్యత్వ నమోదు ప్రక్రియలో యువతీ యువకులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించి, డిజిటల్ యాప్స్ ద్వారా సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రానికి ఆదర్శం

మొదటిపేజీ తరువాయి

తావులేకుండా అందరూ కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తామని సీఎం పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తామని వెల్లడించారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ దిగ్గజం Lionel Messiని హైదరాబాద్‌కు తీసుకొస్తే కూడా విమర్శలు చేశారని వ్యాఖ్యానించారు.
విద్యార్థులకు అందించే విద్యా కిట్ల నాణ్యత విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన యూనిఫామ్‌లు నెలరోజులకే చిరిగిపోయేవని ఆరోపించారు. ప్రస్తుతం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యా కిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచామని, అయితే రూ.680 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని కొందరు ఆరోపిస్తున్నారని, అది ఎలా సాధ్యమో చెప్పాలని ప్రశ్నించారు.
విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలలను అత్యుత్తమ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఉస్మానియాలో ర్యాగింగ్ కలకలం

మొదటిపేజీ తరువాయి

ఆయన స్పష్టం చేశారు.
ఉస్మానియా డెంటల్ కాలేజీలో గత కొన్ని రోజులుగా తెరవెనుక సాగుతున్న ర్యాగింగ్ పర్వం జూన్ తొమ్మిదో తేదీన అధికారికంగా బయటపడింది. కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న కొందరు బీడీఎస్ విద్యార్థులు ధైర్యం చేసి, తమపై సీనియర్ విద్యార్థులు జరుపుతున్న ఆగడాల గురించి కాలేజీ యాజమాన్యానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిరంతర వేధింపుల వల్ల తాము చదువుకోలేకపోతున్నామని, తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కాలేజీ యాజమాన్యం తక్షణమే రంగంలోకి దిగింది. జూనియర్ విద్యార్థుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ స్పందించారు. ఆ రోజే సదరు ఫైనల్ ఇయర్ విద్యార్థులను తన ఛాంబర్‌కు పిలిపించి గట్టిగా మందలించారు. ర్యాగింగ్ నిరోధక చట్టాల గురించి వివరిస్తూ, మరోసారి ఇలాంటి పనులు చేస్తే క్రిమినల్ కేసులు అవుతాయని తీవ్రంగా హెచ్చరించారు. అయితే, కాలేజీ యాజమాన్యం అంతలా హెచ్చరించినప్పటికీ సీనియర్లలో ఏమాత్రం భయం కలగలేదు. ఆ హెచ్చరికలు జారీ చేసిన 24 గంటలు కూడా గడవకముందే, వారు అహంకారంతో జూనియర్లపై మరోసారి ర్యాగింగ్‌కు పాల్పడి తమ పాత బుద్ధిని చాటుకున్నారు.
ర్యాగింగ్ పేరుతో సీనియర్లు చేసిన పనులను ప్రిన్సిపల్ తీవ్రంగా తప్పుపట్టారు. హాస్టల్ గదుల్లో ఉండే జూనియర్ విద్యార్థులను రాత్రి సమయాల్లో పిలిపించి, వారి చేత బలవంతంగా ఆల్కహాల్ (మద్యం సీసాలు), సిగరెట్లు బయటి నుంచి తెప్పించుకునేవారని తెలిపారు. అంతటితో ఆగకుండా హాస్టల్‌లోని కూలర్లలో నీళ్లు నింపడం, తమ వ్యక్తిగత పనులన్నీ జూనియర్ల చేత బానిసల్లా చేయించుకుంటూ తీవ్రంగా వేధించేవారని ప్రిన్సిపల్ వివరించారు. చదువుకోవడానికి వచ్చిన పిల్లలను ఇలాంటి పనులతో వేధించడం అత్యంత దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. సీనియర్ల వేధింపుల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే.. కేవలం మొదటి సంవత్సరం విద్యార్థులే కాకుండా, మూడో సంవత్సరం చదువుతున్న కొందరు విద్యార్థులు కూడా వీరి భయానికి గురయ్యారు. హాస్టల్ గదుల నుంచి బయటకు వస్తే ఎక్కడ సీనియర్లు పట్టుకుని వేధిస్తారో, కొడతారో అనే భయంతో బాధితులు తమ రూమ్‌ల నుంచి బయటకు రావడానికి కూడా వణికిపోయేవారని ప్రిన్సిపల్ తెలిపారు. భయానక వాతావరణం కారణంగా విద్యార్థులు క్లాసులకు సరిగ్గా హాజరు కాలేకపోయారని, భోజనానికి కూడా ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన ఈ విద్యార్థులపై గతంలోనూ ఎన్నో ఫిర్యాదులు ఉన్నాయని కాలేజ్ యాజమాన్యం వెల్లడించింది. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన న్యూ ఇయర్ వేడుకల నెపంతో హాస్టల్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ సీసీ కెమెరాలను వీరు ఉద్దేశపూర్వకంగా పగలగొట్టారని ప్రిన్సిపల్ చెప్పారు. తమ అక్రమాలు రికార్డు కాకూడదనే ఉద్దేశంతోనే వారు ఆ పనిచేసి, ఇతర విద్యార్థులను కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టారని తెలిపారు. ఆ సమయంలోనే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కాలేజీ కమిటీ సిద్ధమైందని గుర్తుచేశారు. గత ఏడాది సీసీ కెమెరాల ధ్వంసం ఉదంతంలో సస్పెన్షన్‌కు గురికావాల్సిన సదరు విద్యార్థులు.. అప్పట్లో యాజమాన్యం కాళ్లవేళ్ల పడి బతిమాలారని ప్రిన్సిపల్ తెలిపారు. తమ భవిష్యత్తు పాడవుతుందని, మరోసారి జీవితంలో ఇలాంటి తప్పులు చేయబోమని రాతపూర్వకంగా క్షమాపణ పత్రాలు ఇచ్చి నమ్మించారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాలేజీ యాజమాన్యం అప్పట్లో పెద్దమనసుతో వారిని క్షమించిందని, కానీ వాళ్ల బుద్ధి ఏమాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ అదే తరహా రౌడీ ప్రవర్తనతో జూనియర్ల జీవితాలతో ఆటలాడుకున్నారని మండిపడ్డారు.
హెచ్చరికలు దాటి ప్రవర్తించిన 12 మంది విద్యార్థులపై యాజమాన్యం ఈసారి ఎలాంటి దయాదాక్షిణ్యాలు చూపించలేదు. నిబంధనలను బూట్ల కింద తొక్కి ర్యాగింగ్‌కు పాల్పడినట్లు విచారణలో నిరూపణ కావడంతో, ఆ 12 మంది విద్యార్థులను కాలేజీ మరియు హాస్టల్ నుండి తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాలేజీలో క్రమశిక్షణను కాపాడటానికి, జూనియర్ విద్యార్థులకు భరోసా ఇవ్వడానికి ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ కఠిన చర్యల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ఒక బలమైన సందేశాన్ని పంపినట్లు ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ తెలిపారు. పిల్లలను కేవలం కాలేజీలకు పంపించడమే కాకుండా, వారు హాస్టళ్లలో ఎలా ఉంటున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉందనే విషయాలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ, బాధ్యత కూడా ఎంతో అవసరమని కాలేజ్ యాజమాన్యం అభిప్రాయపడింది. డాక్టర్లు కావాల్సిన విద్యార్థులు ఇలాంటి నేరపూరిత ప్రవృత్తి అలవాటు చేసుకుంటే ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులోనూ ఉస్మానియా క్యాంపస్‌లో ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని కొనసాగిస్తామని ఆయన నొక్కి చెప్పారు.

# ములుగు అడవుల్లో ఐటీ విప్లవం

మొదటిపేజీ తరువాయి

సొంత ఊర్లోనే ఐటీ ఉద్యోగాలు కల్పించేలా ఏర్పాటు చేసిన 'శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బుధవారం ఘనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి కంపెనీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క.. కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో ముచ్చటించి, వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఐటీ కంపెనీ ఏర్పాటు కావడం ఇక్కడి యువత సాంకేతిక రంగంలో కొత్త భవిష్యత్తుకు దారులు వేస్తుందని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు.
ములుగు జిల్లా కేంద్రంలో శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యకలాపాలు ప్రారంభించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని మంత్రి సీతక్క కొనియాడారు. ఇప్పటివరకు ములుగు లాంటి అటవీ ప్రాంతాల్లో కేవలం వ్యవసాయం, చిన్నపాటి వ్యాపారాలు మాత్రమే జీవనాధారంగా ఉండేవని గుర్తుచేశారు. కానీ, నేడు ఇక్కడి మారుమూల గ్రామాల పిల్లలు కూడా కంప్యూటర్ల ముందు కూర్చుని ప్రపంచ దేశాలకు సేవలందించే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. ఈ సంస్థ ఏర్పాటుతో ములుగు జిల్లా సాంకేతిక ప్రగతి పథంలో సరికొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టిందని ఆమె స్పష్టం చేశారు.
గతంలో ఐటీ రంగం అనగానే కేవలం హైదరాబాద్, బెంగళూరు, సైబరాబాద్ వంటి పెద్ద నగరాలు మాత్రమే గుర్తొచ్చేవని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కానీ, నేటి ఆధునిక డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే ఎక్కడి నుంచైనా పనిచేసే (వర్క్ ఫ్రమ్ ఎనీవేర్) వీలుందని చెప్పారు. అందుకే ఐటీ రంగానికి సంబంధించిన అవకాశాలు, సేవలు కేవలం నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ మరియు ఏజెన్సీ ప్రాంతాలకు సైతం వేగంగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే పల్లెల్లోని టాలెంట్‌కు సరైన గుర్తింపు దక్కుతుందని అభిప్రాయపడ్డారు.
పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు అన్నీ ఒకే నగరంలో లేదా ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కావడం వల్ల సమాజంలో అసమానతలు పెరుగుతాయని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. సంపద, అభివృద్ధి వికేంద్రీకరణ జరిగినప్పుడే మారుమూల ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో ఏర్పాటైన ఈ చిన్న ఐటీ కంపెనీ.. భవిష్యత్తులో జరగబోయే పెద్ద వికేంద్రీకరణ విప్లవానికి ఒక మంచి పునాది అని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రియా ఇన్ఫోటెక్ సంస్థ కేవలం ఆఫీస్ పెట్టడమే కాకుండా, గత ఒక సంవత్సరం కాలంగా ములుగు ప్రాంత యువతకు వివిధ రకాల సాంకేతిక రంగాలలో ఉచితంగా శిక్షణ ఇస్తోందని మంత్రి అభినందించారు. ముఖ్యంగా నేటి మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉన్న యాప్ డెవలప్‌మెంట్ , కోడింగ్ వంటి ఆధునిక నైపుణ్యాలను స్థానిక యువతకు నేర్పిస్తూ వారిని గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దుతోందని ప్రశంసించారు. గ్రామీణ విద్యార్థులకు ఇలాంటి శిక్షణ ఇవ్వడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందన్నారు.
ఈ ఐటీ సంస్థ స్థానిక అవసరాలకు అనుగుణంగా వివిధ మొబైల్ యాప్‌లను సొంతంగా అభివృద్ధి చేస్తోంది. ప్రాంతీయంగా ఉన్న పాఠశాలలు, ప్రైవేటు సంస్థలు మరియు ఇతర చిన్న తరహా వ్యాపారాలకు అవసరమైన వెబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్ సేవలను అందిస్తూ ప్రత్యేకత చాటుకుంటోంది. ప్రస్తుతం ఈ మారుమూల ఏజెన్సీ ఆఫీసులో సుమారు 15 మంది స్థానిక యువతీ యువకులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించి, సొంత ఊరిలోనే గౌరవప్రదమైన జీతాలు అందుకోవడం అభినందనీయమని మంత్రి సీతక్క ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

# ఓట్ల తొలగింపు వెనుక పెద్ద కుట్ర

మొదటిపేజీ తరువాయి

ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి వ్యూహాలతోనే కొన్ని శక్తులు రాజకీయ లబ్ధి పొందాయని, తెలంగాణలోనూ అలాంటి ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.
గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి అజారుద్దీన్, ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. 'సర్' ప్రక్రియ ద్వారా ముస్లింల ఓట్లను జాబితా నుంచి తొలగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ఈ ప్రక్రియ అందరి ఓటర్లకు సంబంధించినదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఒక నిర్దిష్ట వర్గం ఓట్లను ఏరిపారేయడానికి దీనిని ఆయుధంగా వాడుకునే ముప్పు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధికారులు, రాజకీయ శక్తులు ఎలా వ్యవహరిస్తున్నాయనే దానిపై నిరంతరం నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.
గతంలో ఇతర రాష్ట్రాల్లో జరిగిన కొన్ని రాజకీయ పరిణామాలను మంత్రి అజారుద్దీన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాలలో ముస్లింల ఓట్లను వ్యూహాత్మకంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించడం ద్వారానే బీజేపీ అక్కడ రాజకీయంగా లాభపడిందని, అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. అదే తరహా దుష్ట సంప్రదాయాన్ని, కుట్రలను ఇప్పుడు తెలంగాణ గడ్డపై కూడా అమలు చేసేందుకు కొన్ని శక్తులు లోపాయికారీగా ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని మైనార్టీ ఓటు బ్యాంకును దెబ్బతీయడం ద్వారా ఇక్కడి రాజకీయ సమీకరణాలను మార్చాలనేది వారి ప్లాన్ అని దుయ్యబట్టారు. ఈ 'సర్' ప్రక్రియ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రజలు, ముఖ్యంగా మైనార్టీ సోదరులు ఎంతో జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అధికారులు ఇళ్లకు వచ్చినప్పుడు సరైన సమాచారం ఇవ్వాలని, ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో క్రమబద్ధంగా తనిఖీ చేసుకోవాలని కోరారు. ఎవరి ఓటును వాళ్లే బాధ్యతగా కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఎన్నికల్లో గెలుపోటములు అనేవి కేవలం కొన్ని వందలు, వేల ఓట్ల తేడాతోనే మారిపోతాయని, ఇలాంటి తరుణంలో ఓట్లను అక్రమంగా తొలగిస్తే అది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అవుతుందని మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు.





# సింగరేణి బాయిబాటలో కార్మికుల మధ్య కవిత!!

- గని కార్మికుల కష్టాలు విన్న టీఆర్ఎస్ అధినేత్రి
- ఆటోలో ప్రయాణించి ఆటో కార్మికుల సమస్యలపై ఆరా
- కార్మిక సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం చేస్తాం
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 17 (డీడి9వార్త):**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కవిత చేపట్టిన "సింగరేణి బాయిబాట" కార్యక్రమం బుధవారం గోదావరిఖని 11 ఇంక్లైన్ వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా గని కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించిన ఆమె, వారి సమస్యలు, ఇబ్బందులు, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో కార్మికులకు అండగా నిలబడటం తమ బాధ్యత అని తెలియజేస్తూ, సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని భరోసా ఇచ్చారు. భూగర్భ గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు తగిన భద్రతా చర్యలు, మెరుగైన వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటోలో ప్రయాణించిన కవిత, ఆటో కార్మికుల దైనందిన జీవన పరిస్థితులను స్వయంగా తెలుసుకుని వారి సమస్యలను విన్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, విడిభాగాల ఖర్చులు, తగ్గుతున్న ఆదాయంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆటో కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. కార్మికుల చెమటతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, వారి కష్టాలను విస్మరించడం సరికాదని అన్నారు. సింగరేణి కార్మికులు, ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు పాల్గొని కవితకు తమ సమస్యలను వివరించారు. ఈ బాయిబాట కార్యక్రమంలో కవిత వెంట టిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పడాల మనోజా గౌడ్, హెచ్ఎంఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# ఆర్టీఐలో అవకతవకలపై కమిషనర్‌కు ఆధారాలు సమర్పించినవడ్లకొండ మహేందర్ గౌడ్.

**డిడి9వార్త / రామగుండం జూన్ 18:**



పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం రామగుండం సింగరేణి బంగ్లాస్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషనర్ దేశాల భూపాల్‌ను నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ మహేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పలు ప్రజా సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ చట్టం కింద ప్రజలకు తప్పుడు సమాచారం అందిస్తూ తప్పుదోవ పట్టిస్తున్న అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని మహేందర్ గౌడ్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. హాస్టల్ భవనాలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, పరిశ్రమలు,పాఠశాలలు తదితర శాఖలకు సంబంధించిన సమాచారంలో చోటుచేసుకుంటున్న అవకతవకలపై ఆయన సమగ్రంగా వివరించారు. ఇప్పటి వరకు తప్పుడు సమాచారం అందించిన అధికారులకు సంబంధించిన ఆధారాలు, పత్రాలను కమిషనర్‌కు అందజేయగా, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని దేశాల భూపాల్ హామీ ఇచ్చారు. సమర్పించిన పత్రాలపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి కండె సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం!!

- స్కూల్ బస్సులపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- గోదావరిఖని ఏసీపీ మడత రమేష్

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 17 (డిడి9 వార్త):**

పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ స్పష్టం చేశారు. గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లకు బుధవారం ఎన్‌టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల రవాణాలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నైపుణ్యం, అనుభవం కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని, విద్యార్థులను ఎక్కించే, దించే సమయంలో నిర్ణీత ప్రదేశాల్లోనే బస్సులను నిలిపివేయాలని పేర్కొన్నారు. అతివేగం, ప్రమాదకర ఓవర్‌టేకింగ్‌లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డ్రైవర్ల నిర్లక్ష్యానికి సంబంధించి స్కూల్ యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ రెడ్డి, ఎన్‌టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్, రామగుండం ఎస్సై సంధ్యారాణి, రామగిరి ఎస్సై శ్రీనివాస్, ముత్తారం ఎస్సై రవికుమార్‌తో పాటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.






# ఆర్టీసీ డిపో, రైల్వే స్టేషన్‌కు సీఎస్ఆర్ కానుకలు!!

- ప్రయాణికుల సౌకర్యాల కోసం ఎన్టీపీసీ చేయూత
- సామాజిక బాధ్యతలో మరో ముందడుగు
- వాటర్ కూలర్లు, బెంచీలతో ప్రజలకు ఉపశమనం
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీపీసీ కార్యక్రమాలు

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 17 (డిడి9 వార్త):**

రామగుండం ప్రాంత ప్రజల సౌకర్యాల అభివృద్ధికి ఎన్టీపీసీ రామగుండం మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రజా రవాణా కేంద్రాల్లో ప్రయాణికుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అందజేసింది. ఈ మేరకు బుధవారం గోదావరిఖని ఆర్టీసీ డిపోకు స్టెయిన్లెస్ స్టీల్ మూడు సీట్ల బెంచీలు, చల్లని తాగునీటి కోసం వాటర్ కూలర్లను అందించి ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించింది. ఇదే తరహాలో రామగుండం రైల్వే స్టేషన్‌కు నాలుగు స్టెయిన్లెస్ స్టీల్ మూడు సీట్ల బెంచీలు, వాటర్ కూలర్లను అందజేసి రైల్వే ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు సహకరించింది. ప్రజలు ఎక్కువగా వినియోగించే ఈ రెండు కీలక రవాణా కేంద్రాల్లో సౌకర్యాల పెంపుతో వేలాది మంది ప్రయాణికులు లబ్ధి పొందనున్నారు. ప్రయాణికులు వేచి ఉండే సమయంలో సౌకర్యంగా కూర్చునేందుకు, స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందుబాటులో ఉండేందుకు ఈ ఏర్పాట్లు ఉపయోగపడనున్నాయి. ఈ సామగ్రి అందజేత కార్యక్రమాల్లో ఎన్టీపీసీ రామగుండం, టీఎస్ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఎన్టీపీసీ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలు వివరాలను సంబంధిత అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాలపై ఎన్టీపీసీ సంస్థ స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటున్నది. సమాజాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఎన్టీపీసీ రామగుండం నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.






# జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన సర్పంచ్ రవి కుమార్.

**డిడి9వార్త / రామగుండం జూన్ 18:**

ఈ రోజు స్థానిక జెడ్పీహెచ్ఎస్ (టిటిఎస్ ) అంతర్గాం పాఠశాలను సర్పంచ్ రవి కుమార్ సందర్శించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణతో పాటు ఇతర విద్యా శిక్షణా తరగతులను పరిశీలించి, వాటి నిర్వహణ, విద్యార్థుల అభ్యాసం గురించి ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సంఖ్య (స్ట్రెంగ్త్ ) మరింత పెరిగేలా తీసుకోవాల్సిన చర్యలు, విద్యా ప్రమాణాల మెరుగుదల, అలాగే పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఉపాధ్యాయులతో సవివరంగా చర్చించారు.ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సహకారంతో గ్రామంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా, ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసే దిశగా నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ రవి కుమార్ తెలిపారు.

# జనగామ గ్రామ శ్రీ పాటి అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.30 వేల ఆర్థిక సహాయం.

- బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి అందజేత.

**డిడి9వార్త / రామగుండం జూన్ 18:**

శ్రీ పాటి అభయాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధి పనుల కోసం ఆలయ కమిటీ అధ్యక్షులు నడిపెల్లి గోపాలరావు, జనగామ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామల,రమేష్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన దేవాలయ అభివృద్ధి కోసం రూ .30,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నీలం సంజీవ్ పటేల్, ఆరేళ్ల రవితేజ, పోలాడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు, దాతలు ముందుకు రావాలని వారు కోరారు.



# ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావుని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం.

- రామగుండంనియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు.

**డిడి9వార్త / రామగుండం జూన్ 18:**

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సలహాదారులుగా వీ హనుమంతరావు ఎన్నికైన సందర్భంగ కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో భోకేలతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సలహాదారులుగా వి హనుమంతరావు పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారిని, మున్నూరు కాపుచైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని హైదరాబాదులోని రవీంద్రభారతిలో మా రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం పక్షాన వారిని మర్యాదపూర్వకంగా కలిసి రాబోయే కాలంలో మా మున్నూరు కాపు సంఘానికి, రామగుండం నియోజకవర్గం మీ వంతుగా కృషి చేసి మా మున్నూరు కాపు సంఘం మరి ఎంతో అభివృద్ధి చెందేలా మీ సహాయ సహకారాలు అందించాలని, రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకుల పక్షాన ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావుని, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని కోరడం జరిగిందని రామగుండం నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు తెలిపారు.



# ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని కలిసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు.

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 18:**

హైదరాబాద్ లోని డా.బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించిన తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, ఓదెల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.



# మెగా జాబ్ మేళా

**కన్నాయిగూడెం జూన్ 17(డిడి9 వార్త)**



ములుగు జిల్లా కన్నాయిగూడెం నుంచి మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు మంత్రి సీతక్క ఆధ్వర్యంలో పోలీస్ వారు నిర్వహించిన మెగా జాబ్ మేళకు 70 కంపెనీలకు పైగా పాల్గొన్నారు ఈ జాబ్ మేలకు వివిధ మండలాల ఓనుంచి వచ్చిన నిరుద్యోగులు యువతీ యువకులు పాల్గొనడం జరిగింది కన్నాయిగూడెం మండలం నుంచి పాల్గొన్న యువతి యువకులను ఎస్సై వెంకటేష్ దగ్గరుండి వారిని తీసుకుపోవడం జరిగింది. ఎంపికైన యువతి యువకులకు ప్రైమెరీ హెల్త్ కేర్, సొసైటీ హోమ్ కేర్, నర్సింగ్, అపోలో, వివిధ ఖాళీలలో 12 మంది సెలెక్ట్ కావడం జరిగింది




# ములకలపల్లి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- **బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...**


**అశ్వారావుపేట:జూన్ 17 ( డిడి 9 వార్త)**

అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం ములకలపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు మొదటగా కొత్తగంగారం గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం వద్ద వర్షాకాలంలో వరద నీటి ప్రవాహం సమస్యను నివారించేందుకు రూ.31.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న పటిష్టమైన గైడ్‌వాల్ పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం జగన్నాధపురం గ్రామపంచాయతీ పరిధిలో స్వయం సహాయక సంఘాల మహిళల అవసరాల కోసం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు వీవో (VO) భవనాలకు శంకుస్థాపన చేశారు మహిళా సంఘాల సమావేశాలు శిక్షణా కార్యక్రమాలు ఉపాధి కార్యకలాపాలకు ఈ భవనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు

తదుపరి జగన్నాధపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారుఅనంతరం మూకమామిడి నుంచి ఎర్రప్పగుంపు మీదుగా రంగాపురం గ్రామం వరకు రూ.1 కోటి వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు ఈ రహదారి నిర్మాణంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమవడంతో పాటు రైతులు విద్యార్థులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు ఈ సందర్భంగా చవిటిగూడెం, పొగడ్లపల్లి, తాళ్లపాయి గ్రామాలకు చెందిన 47 మంది అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు పేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు అనంతరం రింగురెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపన చేశారు చివరిగా ములకలపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో మాట్లాడారు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను అందుకోవాలని ఆకాంక్షించారు



ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అశ్వారావుపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా రహదారులు విద్య, ఇందిరమ్మ గృహాలు మహిళా సంక్షేమం మౌలిక సదుపాయాల రంగాల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్నామని ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు త్వరలోనే చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,పార్టీ ముఖ్య నాయకులు, పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, యువ నాయకులు, మహిళా నాయకులు, పిల్లల తల్లిదండ్రులు మొదలైన వారు పాల్గొన్నారు.







## ఉపాధి హామీ కార్మికులను కలిసిన ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి.

- **కార్మికులకు మజ్జిగ మరియు పండ్ల పంపిణీ.**

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 18:**

జీడి నగర్, కన్నాల గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులను బీజేపీ ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి మాజీ పెద్దపల్లి బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డితో కలిసి ఈ రోజు కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడిన సంధ్యారాణి గారు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, కార్మికుల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అలాగే ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, పీఎం కిసాన్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని వివరించారు.ప్రస్తుతం నెలకొన్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కార్మికులకు మజ్జిగ మరియు పండ్లు పంపిణీ చేసి, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు .ఈ సందర్భంగా మాజీ పెద్దపల్లి బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కార్మికుల సంక్షేమం మరియు గ్రామాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధి, దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారి సంక్షేమం కోసం కేంద్రంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొమిరె లక్ష్మణ్, కంకటి శ్రీను, మబ్బు సాయి, భీమనపల్లి రామచందర్, తాటి పాముల పవన్, తువ్వ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## జనగామ ఆలయాన్ని సందర్శించిన రాష్ట్ర సమాచార చైర్మన్ కమీషనర్లు.

- **వారికీ సన్మానం చేసిన కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 18:**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ జనగామ గ్రామంలోని శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు పర్వీన్ కుమార్, భూపాల్, పి.వి. శ్రీనివాసరావు, అయోధ్య రెడ్డి. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్ ఆధ్వర్యంలో కమిషన్ చైర్మన్ మరియు కమిషనర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామ పెద్దలు దేవాలయ విశిష్టత, చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత గురించి వారికి వివరించారు. ఆలయ చరిత్రను ఆసక్తిగా తెలుసుకున్న కమిషన్ సభ్యులు దేవాలయ అభివృద్ధిపై ప్రశంసలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేష్ శర్మ , గ్రామ పెద్దలు నడిపెల్లి గోపాల్ రావు , ఏలేశ్వరం శ్రీనివాస్, అరెల్ల రవితేజ, జనగామ బద్రి. తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. త్రిలింగ రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వారు ఆకాంక్షించారు.



## కూలీ రేట్ల పెంపు విషయంలో మూర్ఖంగా వ్యవహరిస్తున్న కూరగాయల మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారులు.

- **డి.సి.ఎల్ సూచనలు కూడా ఖాతరు చేయడం లేదు.**
- **జూన్ 20 లోపు కూలీ రేట్లు పెంచకుంటే 21 నుండి సమ్మెలోకి వెళ్తాం - హమాలీ వర్కర్స్ యూనియన్ నేత ఎం.ఏ.గౌస్ హెచ్చరిక.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 18:**

గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్ల పెంపు విషయంలో గోదావరిఖని కూరగాయల మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారులు మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా లేబర్ కమిషనర్ సూచనలు కూడా ఖాతరు చేయకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ గోదావరిఖని మార్కెట్ అధ్యక్షులు ఎం.ఏ.గౌస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నెల 20 లోపు కూలీ రేట్లు పెంచాలని, లేకుంటే 21 నుండి సమ్మెలోకి వెళ్తామని ఆయన హెచ్చరించారు.బుధవారం గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో జరిగిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని గత ఏడు సంవత్సరాలుగా పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ హోల్‌సేల్ వ్యాపారులు కూలీ రేట్లు పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.కూలీ రేట్లు పెంపుపై డి.సి.ఎల్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన హోల్‌సేల్ వ్యాపారులు మరియు హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిసి మాట్లాడుకోవాలని సూచించారని, వారి సూచన మేరకు గత పది రోజుల క్రితం హోల్‌సేల్ వ్యాపారులను సంప్రదించినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.దీనిపై హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిపి, జూన్ 20 లోపు హోల్‌సేల్ వ్యాపారులు స్పందించి కూలీ రేట్లు పెంచితే సరే, లేకుంటే 21 నుండి సమ్మెలోకి వెళ్తామని ఆయన తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీ మియా, గాలి పెల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## అంగన్వాడీలో చేర్పించడం వల్ల పిల్లల మేధో శక్తి అభివృద్ధి చెందుతుంది.

- **సిపిఐ ఫ్లోర్ లీడర్ 41 డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 18:**

చిన్నపిల్లలను పాఠశాలలో చేర్పించే కంటే ముందు అంగన్వాడి పాఠశాలలకు పంపడం వల్ల వారికి మేదోశక్తి పెరుగుతుందని అలాగే క్రియేటివ్ నాలెడ్జ్ ఉత్పన్నం అవుతుందని కావున తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలల కంటే ముందు అంగన్వాడి లకు పంపించాలని సిపిఐ ఫ్లోర్ లీడర్ 41 డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య విజ్ఞప్తి చేశారు. 41వ డివిజన్లోని ఎల్బీనగర్2 మరియు జవాష్ నగర్ అంగన్వాడి సెంటర్ల లో పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యూనిఫామ్స్ ని పిల్లలకు అందజేయడం జరిగింది నూతనంగా ఈరోజే అంగన్వాడీలో చేరే పిల్లలకు ఈ సందర్భంగా అక్షరాభ్యాసం చేయించి డివిజన్లోని ఇతర పిల్లలను అంగన్వాడీలలో చేరాలని కోరుతూ అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం పేరిట డివిజన్లో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్వాడీలకు వచ్చే ప్రతి విద్యార్థి యూనిఫామ్ ధరించి ప్రైవేటు పాఠశాలకు వెళుతున్న విధంగా ఉండాలని సమానత్వంతో పాటు పిల్లలు అంగన్వాడీల పట్ల ప్రత్యేక ఆకర్షణ చూపించాలని ప్రతి అంగన్వాడీ విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా యూనిఫామ్స్ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు కచ్చితంగా పాఠశాలలు వేసే కంటే ముందు ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్వాడికి పంపించడం ద్వారా వారి తెలివితేటలు పెరిగే అవకాశం ఉండడంతో పాటు పిల్లల చురుకుదనం మరింత పెరుగుతుందని తద్వారా విద్యలో ఉన్నతంగా రాణించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఇప్పటికే ఎల్బీనగర్ అంగన్వాడి అనేక విషయాల్లో రామగుండంలో అంగన్వాడీలకు ఆదర్శంగా నిలుస్తున్న క్రమంలో రాబోయే కాలంలో మరింత మంది విద్యార్థులను చేరే విధంగా తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జమున, షరీన్ అంగన్వాడీ టీచర్లు జయసుధ, అరుణ, మల్లీశ్వరి , భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం స్వరూప ఆశ వర్కర్ సరస్వతి తో పాటు పిల్లల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## సింగరేణి సంస్థ కార్మికులు వారి పిల్లల పట్ల నిర్లక్ష్యం తగదు.

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 18:**

సెంటినరీ కాలనీ నుండి 8 కాలనీ కి ఆటోలలో స్కూలుకు పిల్లలను పంపడం తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడుతున్నారు సింగరేణి కాలరీస్ కంపెనీ కార్మికుల పట్ల కార్మిక కుటుంబాల పట్ల విద్యా పట్ల ఎంత నిర్లక్ష్యము చేస్తున్నదో కార్మికులందరూ గమనిస్తున్నారు. రాజకీయ నాయకులు వారి మీటింగులకు ఎంత ఖర్చు అయినా పెట్టడం అలవాటు అయినది కంపెనీకి కంపెనీలో మిషనరీ కి కావాల్సిన స్పేర్ పార్ట్స్ అందజేయడం లో నిర్లక్ష్యం వహించడం ఇవి అన్ని పైనుంచి కిందిస్థాయి అధికారులను క్షేత్రస్థాయిలో కార్మికులు గమనిస్తూ ఉన్నారు . 8 ఇంక్లియన్ నుండి సెంటినరీ కాలనీ స్కూల్




బస్ ఈ విద్యా సంవత్సరం లేకపోతే అర్జీ టు జి. ఏం ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాము.

# స్వచ్ఛదనం పరిశుభ్రతకు బోనకల్ గ్రామ పంచాయతీ శ్రీకారం

- **ఆహ్లాదకరమైన వాతావరణంలో పబ్లిక్ టాయిలెట్స్ ప్రారంభం**
- **అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామ అభివృద్ధి సాధ్యం**
- **గ్రామ సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ బానోత్ కొండ**

**బోనకల్, జూన్ 17:**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి కార్యాచరణలో భాగంగా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛదనం పరిశుభ్రతే లక్ష్యంగా గ్రామ పంచాయతీ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని బోనకల్ సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, ప్రజా బాధ్యతలపై కొండ కీలక సూచనలు చేశారు.
గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా కాలువల్లో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేయకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, నీరు రోడ్లపైకి చేరి దోమలు, వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు.
నిబంధనలను ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో లేదా కాలువల్లో చెత్త వేస్తే గ్రామ పంచాయతీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పరిశుభ్రమైన గ్రామ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.
అదేవిధంగా ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించాలని కోరారు. బహిరంగ మలమూత్ర విసర్జన పూర్తిగా మానుకోవాలని, గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా నిలబెట్టడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి పరిశుభ్రతే ప్రధాన ఆధారం అని ఆయన పేర్కొన్నారు.
గ్రామ పరిధిలోని వ్యాపారులు తమ వ్యాపార అనుమతి పత్రాలను వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయంలో పునరుద్ధరించుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామంలో అన్ని వ్యాపార సంస్థలు నిబంధనలకు లోబడి పనిచేయాలని కోరారు. గ్రామాభివృద్ధి అనేది కేవలం అధికారుల బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని బానోతు కొండ అన్నారు. ప్రతి కుటుంబం సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి గ్రామ పంచాయతీకి సహకరిస్తే పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, ఆదర్శవంతమైన గ్రామంగా బోనకల్ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
**"పరిశుభ్రమైన గ్రామం –**
ఆరోగ్యవంతమైన సమాజం" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో... మండల ఇరిగేషన్ అధికారి కొండలరావు, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, మండల అధికారులు, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పెద్దలు తెల్లాకుల శ్రీనివాసరావు, బిళ్ళ విశ్వనాథం, మండల పరిషత్ మాజీ ఉప అధ్యక్షులు గుగులోతు రమేష్, టేకులపల్లి సాంబయ్య, గ్రామపంచాయతీ పాలకవర్గం యార్లగడ్డ కుమారి, మరిదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, అంతోటి సునీత, షేక్ మేర సాహెబ్, జరుపల లావణ్య, తాలూరి జ్యోతి, ఉప్పర శ్రీను, షేక్ నౌషిన్, మరియు బదావత్ హుస్సేన్ నిమ్మల రాజశేఖర్, కలవల బాబు, సెల్ పాయింట్ సాయి కృష్ణ, వేమా లలిత, టైగర్ విజయ్, జిడుగు వెంకటేశ్వర్లు, బోడ అంజి, యోగి శ్రీనివాస్, జర్పుల శివ కృష్ణ, జూపల్లి వెంకటేశ్వర్లు, ధారావతు సాధు, మరియు వ్యాపారస్తు స్థానిక ప్రజలు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన సర్పంచ్ పోకల శ్రీనివాస్

**జనగామ జూన్ 17(డిడి 9వార్త)బ్యూరో**

ప్రభుత్వ విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను ఇబ్రహీంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పోకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ చింత నరేష్ విద్యార్థులకు పుస్తకాలు అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోకల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంక్షేమ పథకాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. నాణ్యమైన విద్యతోనే సమాజంలో గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ట్రక్కు చోరీ కేసులో నిందితుల అరెస్ట్...

- **యువతకు సహకరించిన పోలీస్ సిబ్బంది..**

**అశ్వరావుపేట:జూన్ 17 (డిడి 9 వార్త)**

ఈనెల 13వ తారీఖున నారాయణపురం గ్రామంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఈరోజు మధ్యాహ్నం చోరీకి పాల్పడిన నిందితులను అశ్వరావుపేటలోని పాపిడి గూడెం రోడ్ శివారులో వాహన తనిఖీ చేస్తుండగా పట్టుకొని విచారించగా వారి వివరాలు

1. కట్టూరి సుందర బాబు, R/o. పి అంకంపాలెం గ్రామం, జిలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం
2. జక్కుల చిన్ని అలియాస్ నాగేశ్వరరావు, R/o. నారాయణపురం గ్రామం, అశ్వరావుపేట మండలం
3. నరదల ప్రసాద్, R/o. నారాయణపురం గ్రామం అని

వీరు ముగ్గురు గత కొంతకాలంగా తమ జల్సాలకు అలవాటు పడి, ఆర్థిక పరిస్థితులు బాగాలేనందున ఎక్కడైనా ఒంటరిగా పార్క్ చేయబడిన ట్రాక్టర్ విడిభాగాలు దొంగలిస్తున్నారని, అట్టి దొంగలించిన వాటిలో ఈరోజు బత్తుల నాగేశ్వరరావుకు చెందిన ట్రాక్టర్ ట్రైలర్ ను సత్తుపల్లి పట్టణంలో ఎవరికైనా అమ్మేసి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని అంకంపాలెం గ్రామం లోని ఒక పామాయిల్ తోటలో నుండి దాచు మించిన ట్రైలర్ను తన ట్రాక్టర్ ఇంజన్ తో పాటుగా బయటకు తీసి అశ్వరావుపేట మీదుగా సత్తుపల్లి వెళ్లే క్రమంలో పాపిడి గూడెం మీదుగా అశ్వరావుపేటలోకి వస్తుండగా అక్కడే వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు వారిని పట్టుకొని విచారించగా వారి నేరం ఒప్పుకొని, దొంగలించబడిన ట్రక్కుతో పాటు మరో ట్రాక్టర్ యొక్క ట్రైలరు అదే విధంగా డబల్ బ్లేడ్ డిస్క్ ను కూడా దొంగలించినారని చెప్పి నేరం ఒప్పుకోగా నిందితుల వద్ద నుండి అట్టి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నిందితులను దమ్మపేట మెజిస్ట్రేట్ ముందు రిమాండ్ నిమిత్తం హాజరు పరచడమైనది.




# గిరిజనేతరులను ఏజెన్సీ గ్రామాల నుండి వెళ్ళగొట్టాలనే కుట్రలు మానాలి

- **టిడిపి ములుగు నాయకులు దేవా నాయక్**



ములుగు జిల్లా ను ఇప్పటి పాలకులు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదు ఇక్కడి చెరువులు దేవాలయాలు కాకతీయుల కాలంలోనే అభివృద్ధి చెందాయి వేల ఎకరాల భూములలో పంటలు పండ డానికి రైతులు జీవించడానికి చక్కటి అనువైన ప్రదేశంలో లక్నవరం రామప్ప లాంటి చెరువులు నిర్మాణం చేసింది కాకతీయుల కాలంలోనే అవి లేకుంటే ములుగు ప్రాంతం.కరువు కాటకాలతో ప్రజలు విల విల కొట్టుకోవాల్సిందే సకల జనులు సకల జీవరాశులు బ్రతడానికి కాకతీయులు ఎంతో ముందు చూపుతో నిర్మాణం చేసారు వారికాలంలో సకల జనులకు సమాన అవకాశాలు కల్పించారు కులమత ప్రాంత భేదాలు లేకుండా పాలన చేసారు ఇప్పటి పరిస్థితికి కారకులు ఎవరు ఈప్రాంతంలో గిరిజనేతరులు ఎందుకు స్వేచ్చగా బ్రతక లేక పోతున్నారు పీసా చట్టం పేరుతో వేరే ప్రాంతం లోని గుత్తి కోయలను ఇక్కడికి తీసుక వచ్చి గిరిజనేతరులపై దాడులు చేయిస్తూ ఉన్న రాజకీయ నాయకులు ఎవరు అనే విషయం స్థానిక గిరిజనేతరులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది చట్టాల పేరుతో చుట్టాలను తెచ్చి ఇక్కడ రాజకీయాలు చేస్తున్న దేవరు ములుగు జిల్లా ప్రజలు అర్థం చేసుకోవాలి
మైదాన ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేక పోవచ్చును కానీ ఏజెన్సీ గ్రామాలలో నివసిస్తున్న గిరిజ నేతరులను మన సోదరులు గా బందువులు గా బావించుకొని వారి ఆలోచనలకు అనుగుణంగా మద్దతు తెలుపుతూ రాజకీయాలు చేయాలని ఓటు వేయాలని దేవా నాయక్ దళిత బహుజన గిరిజ నేతరులకు పిలుపు నిచ్చారు గిరిజ నేతరులు రెండు రోజులు గా ఏజెన్సీ ప్రాంతగిరిజ నేతరులు ఇబ్బంది పడుతుంటే పాలకులు స్పందించక పోవడలోనీ ఆంతర్యం ప్రజలకు అర్థం చేసుకోవాలి అని దేవా నాయక్ కోరుచున్నారు



# విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ..

**జూన్17 డిడి9 వార్త వెంకటాపురం.**

జడ్పీఎస్ఎస్ వెంకటాపురం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల ఉపసర్పంచ్ సన్నీ, పాఠశాల ఏపీసీ అధ్యక్షురాలు స్వరూపరాణి, ఏపీసీ సభ్యురాలు అరుణ, ప్రధానోపాధ్యాయులు జీవీవీ సత్యనారాయణ పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో మాట్లాడిన ప్రధానోపాధ్యాయులు జీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నామని, త్వరలో ప్రభుత్వం ద్వారా రెండు జతల యూనిఫాంలను కూడా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా తప్పనిసరి..

- **సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు..**
- **డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. కోరం క్రాంతికుమార్**

**జూన్17 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో బుధవారం వైద్య సిబ్బంది సమీక్ష సమావేశం ఏటూరునాగారం ఐటీడీఏ జిల్లా ఉప వైద్య & ఆరోగ్య శాఖాధికారి డా. కోరం క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాలు నిండిన బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్) నివారణ కోసం హెచ్‌పీవీ (HPV) టీకా అత్యంత అవసరమని ఆయన తెలిపారు. "ఒక అడుగు టీకా - మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం" అనే సందేశంతో తల్లిదండ్రులు తమ కుమార్తెలకు తప్పనిసరిగా టీకా వేయించాలని కోరారు. టీకా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ప్రతి గ్రామంలో ప్రతి మంగళవారం, శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో టెమీఫాస్ మందు చల్లడం, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో అతిసారం వంటి వ్యాధులు ప్రబలకుండా తాగునీరు, పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరచాలని పేర్కొన్నారు. అలాగే జూన్ 28, 2026 (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా ముందస్తు ప్రచారం చేపట్టాలని, గ్రామ పెద్దలు, ప్రజలకు సమాచారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు.ఈ సమావేశంలో వైద్యాధికారి డా. భాస్కర్, పీహెచ్ఎన్ ఏకమ్మ, హెచ్ఈఓ కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ బడులకే ప్రాధాన్యం.. బుస్సాపూర్‌లో ప్రత్యేక చొరవ.

- **ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సర్పంచ్ పాలెం యాదగిరి పిలుపు**

**గోవిందరావుపేట, జూన్ 17 (డి డి 9 వార్త)**

బుస్సాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు ఇటీవల ప్రీప్రైమరీ విభాగం మంజూరు కావడంతో గ్రామంలో ప్రభుత్వ విద్యపై నమ్మకం మరింత పెరిగింది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, ప్రశాంతమైన విద్యా వాతావరణం, నాణ్యమైన బోధన అందుబాటులో ఉండటంతో తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు.ఈ క్రమంలో గ్రామానికి చెందిన దీకొండ ఈష, బేతి దేవాన్ష్ రెడ్డి తదితర చిన్నారులకు బుధవారం ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు కల్పించారు. గ్రామ సర్పంచ్ పాలెం యాదగిరి చేతుల మీదుగా అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించగా, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ బండపల్లి రాజశేఖర్, వార్డు సభ్యుడు బేతి దేవేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.అనంతరం జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వీధులలో తిరుగుతూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను కూడా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరుతూ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని గ్రామ ప్రజలందరూ బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ పాలెం యాదగిరి పిలుపునిచ్చారు. గ్రామ పాలకవర్గం, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి పూర్తి సహకారం అందిస్తామని, గ్రామంలోని ప్రతి చిన్నారి ప్రభుత్వ బడిలోనే విద్యాభ్యాసం చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.




# హరికృష్ణ మృతి కేసులో న్యాయం చేయాలి

**జనగామ జూన్ 17 (డిడి 9వార్త )బ్యూరో**

50 రోజులు గడిచినా నిందితుల అరెస్టు లేదంటూ కలెక్టర్‌కు వినతి వికారాబాద్ జిల్ల రుద్రారం గ్రామంలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన తలారి హరికృష్ణది హత్యేనని ఆరోపిస్తూ, కేసును వేగవంతం చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఘటన జరిగి 50 రోజులు గడిచినా దర్యాప్తులో ఆశించిన పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
హరికృష్ణ ఈ ఏడాది ఏప్రిల్ 29న పని నిమిత్తం రుద్రారం గ్రామానికి వెళ్లగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు విచారణలో నిర్లక్ష్యం కొనసాగుతోందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి వినతులు అందజేసినా ఫలితం లేకపోయిందన్నారు.
ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని కేసును నిష్పక్షపాతంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.



# పది విద్యార్థుల ప్రతిభకు నగదు పురస్కారం ప్రకటన

- **మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.25,116..**
- **గ్రామ స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.10,116..**
- **పది విద్యార్థులకు సర్పంచ్ బానోతు జ్యోతి,బానోతు కొండ బంపర్ ఆఫర్**

**బోనకల్, జూన్ 17,(డీడీ9 వార్త):**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ బానోతు కొండ అన్నారు. బోనకల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్,ఉప సర్పంచ్ దంపతులు మాట్లాడుతు పదవ తరగతిలో ఉత్తీర్ణులై మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.25,116 నగదు బహుమతి అందజేస్తామని,అలాగే గ్రామస్థాయిలో మొదటి స్థానం సాధిస్తే రూ.10,116 నగదు బహుమతి ప్రకటించారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించి, ఉన్నత ఫలితాలు సాధించేలా ప్రోత్సహించడమే ఈ నిర్ణయం లక్ష్యమని తెలిపారు.నేటి సమాజంలో విద్య ఎంతో విలువైన ఆస్తి అని, చదువుతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు.

పేదరికాన్ని జయించడానికి, మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలకు క్రమం తప్పకుండా పంపిస్తూ చదువులో ప్రోత్సహించాలని కోరారు.



గ్రామం నుంచి మరింత మంది ప్రతిభావంతులు తయారై ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల విజయం గ్రామాభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పోటువెంకటేశ్వర్లు ,మరిదు శేషు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పార్టీ శిక్షణ కార్యక్రమంలో మర్యాదపూర్వక రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భేటీ

- **తిరుమలాయపాలెం మండల, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న**

**తిరుమలాయపాలెం, జూన్ 17, డి డి 9 వార్త**

పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమానికి హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ పాలేరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే,కందాళ ఉపేందర్ రెడ్డి మరియు రాష్ట్ర పార్టీ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన తిరుమలాయపాలెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతోంది అని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు,భాషబోయిన వీరన్న,మాట్లాడుతూ తెలియజేశారు.



# మొరుమూరులో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం

**వాజేడు, జూన్ 17 (డిడి9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండలం మొరుమూరు గ్రామపంచాయతీ పరిధిలోని మొరుమూరు కాలనీ ఎం.పి.పి.ఎస్ పాఠశాల వద్ద బుధవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్తగా చేరిన చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు పావని, గ్రామ సర్పంచ్ మడకం సుభద్ర, వార్డు సభ్యురాలు తెల్లం దివ్య, అంగన్‌వాడీ టీచర్లు ఉష, రమాదేవి, ఆశా వర్కర్ ముత్తమ్మ పాల్గొన్నారు.

అనంతరం సర్పంచ్ మడకం సుభద్ర చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. చిన్నారులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు.





# మూతపడిన పాఠశాలకు పునర్జీవం.. విద్యాభివృద్ధికి కడియం శ్రీహరి హామీ

**జనగామ జూన్ 17(డిడి 9వార్త )బ్యూరో**

ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లిలో 14 ఏళ్లుగా మూతపడిన మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రీప్రైమరీ పాఠశాలను కూడా ప్రారంభించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు.

అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలో వసతులు లేదా ఉపాధ్యాయుల కొరత కారణంగా ఒక్క ప్రభుత్వ పాఠశాల కూడా మూతపడకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. నర్సింగరావుపల్లి పాఠశాలను మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేసి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యా రంగ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శిభారాణి కుమారస్వామి, డీఈవో, ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.






# కల్తీ విత్తనాలను అరికట్టాలి కాంప్లెక్స్ ఎరువులను ఆన్లైన్లో సంబంధం లేకుండా రైతులకు ఇవ్వాలి

- **తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కు వినతి**

**తిరుమలాయపాలెం, జూన్ 17,డిడి 9 వార్త**

తిరుమలాయపాలెం మండలంలో వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినందున రైతులకు కల్తీ లేని విత్తనాలను సప్లై చేయాలని నకిలీ విత్తనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ లూథర్ విల్సన్ కు మెమొరోనా సమర్పించడం జరిగింది . రైతు సంఘం మండల కార్యదర్శి బింగి రమేష్ మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ లో నకిలీ విత్తనాల పేరిట మోసం చేస్తున్న డీలర్ల పై చర్య తీసుకోవాలని యూరియా కాంప్లెక్స్ ఎరువులను ఆన్లైన్లో సంబంధం లేకుండా మందులు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ యొక్క కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు పుల్లూరి నాగేశ్వరరావు సిపిఐఎం మండల కార్యదర్శి శ్రీను మద్దినేని శ్రీనివాసరావు జానయ్య వెంకన్న,దొడ్డేటి నిర్మల్ రావు వశపోంగు వీరన్న విజయపాల్ రెడ్డి కొత్తపల్లి దామోదర్ రెడ్డి కొల్లిచలం స్వామి,వీరన్న నేరుసుల వెంకటేశ్వర్లు చిగురుపాటి ఉపేందర్ మండల సిపిఎం పార్టీ నాయకులు గ్రామ శాఖ నాయకులు గ్రామ ప్రజలు సిపిఎం కార్యకర్తలు గ్రామస్తులు అధికారులు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన కార్యదర్శి రాందాస్‌కు ఘన సన్మానం

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

ఇటీవల గుడిహత్నూర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఇజ్జగిరి రాందాస్‌ను బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కారోభారీ అమీన్ అలీ, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు శాలువా కప్పి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి రాందాస్ అందించిన సేవలను కొనియాడుతూ, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





# బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో బదిలీ అయిన సిబ్బందికి ఘన సన్మానం

**బీర్కూర్, జూన్ 17(డిడి9 వార్త):**

బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన భాను ప్రకాష్‌తో పాటు వివిధ గ్రామపంచాయతీలలో పనిచేసిన కార్యదర్శులు ఇటీవల బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన సందర్భంగా వారికి ఘనంగా సన్మానం నిర్వహించారు. బుధవారం బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనిధి, ఎంపీవో మహిబూబ్, ఏపీవో అక్మల్, ఏఎంసీ వైస్ చైర్మన్ యామ రాములు, సర్పంచులు బోయిని శంకర్, ధర్మతేజ, అప్పారావు, దేవీసింగ్, బాన్సువాడ మనెవ్వ, మాజీ ఎంపీపీ రఘు, బస్వారాజ్ పటేల్, కనిగిరి కాశీరాం, రాచప్ప పటేల్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన అధికారులను, కార్యదర్శులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. బీర్కూర్ మండల అభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడుతూ, భవిష్యత్‌లో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.సన్మానితులు మాట్లాడుతూ బీర్కూర్ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# రైతులకు నాణ్యతలేని నకిలీ విత్తనాలు ఇస్తే తగిన చర్యలు తప్పవు...

- **విత్తనాలపై అధిక ధరలు తగ్గించి కనిష్ట ధరలకు అమ్మాలి**
- **గతంసారి కన్నాయిగూడెం మండలంలోని చాలా ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు ఇచ్చి రైతులను మోసం చేసారు....**
- **మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో పర్యవేక్షణ చేస్తూ తనిఖీలు చేయాలి...**
- **కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి (సర్పంచ్ )జాడి రాంబాబు**



**కన్నాయిగూడెం జూన్ 17 (డిడి9 వార్త)**

కన్నాయిగూడెం మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణల్లో గత కొన్ని సంవత్సరాలనుండి నకిలీ విత్తనాలు కానీ నకిలీ పురుగు మందులు ఇస్తూ రైతులను నట్టేట ముంచుతూ మోసం చేస్తున్నారు నాణ్యతలేని విత్తనాలు ఇచ్చి రైతులకు దిగుబడులు రాక అప్పులపాలు అయ్యి రైతుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి ఇప్పుడిప్పుడే రైతుల ముఖంలో ఆనందాలు నిండే సమయన పంటకు కనీస మద్దతు ధర పలికే రోజుల్లో ఫర్టిలైజర్స్ నకిలి విత్తణాలు ఇచ్చి రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు, గతంలో చాలా సార్లు నకిలీ విత్తనాలు ఇచ్చి రైతులకు దిగుబడులు రాక చాలా ఇబ్బందికి గురి అయ్యారు అలాగే నకిలీ పురుగుల బయో మందులు ఇచ్చి కంపెనీ మందులు అని రైతుల దగ్గర అధిక డబ్బులు వసూల్ చేసి రైతులకు దిగుబడులు లేక చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయి, తెలంగాణ ప్రభుత్వం రైతుల పట్ల ఒక శిత్తశుద్ధితో రైతే రాజు కావాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తుంది తెలంగాణ ఏర్పాటు అయినా దగ్గర నుండి 2014 నుండి 2023 వరకు అప్పటి పాలకుల పాలన వలన చాలా మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు కానీ ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి 2024 నుండి ఒక్క రైతు కూడా ఆత్మహత్యయత్నం చేసుకోలేదు ఎందుకంటే రైతుల పట్ల తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రత్యేక శ్రద్ధతో అన్ని రకాల సదుపాయాలు గ్రామాల్లో అందుబాటులో ఉంచి రైతే రాజు చేయాలనీ ఒక సంకల్పంతో ముందుకు వెళ్తుంది ఇలాంటి మంచి సమయాలలో ఫర్టిలైజర్స్ దుకాణాలు ఇలా రైతులకు నకిలీ విత్తనాలు నకిలీ పురుగు మందులు ఇచ్చి రైతుల జీవితాలతో ఆడుకోవద్దు ఇక నుండి అయినా ఇలాంటి నకిలీ వ్యవస్థ మానుకొని ఫర్టిలైజర్స్ యాజమాన్యం వ్యవస్థ మంచిగా నడుపుతూ రైతులకు ఇలాంటివి మళ్ళీ జరగకుండా విత్తనాలు కానీ, ఎరువులు కానీ, పురుగుమందులు కానీ ప్రత్యేకంగా విత్తనాలు అధిక ధరలకు అమ్ముతున్నారు ధరలు తగ్గించి రైతులకు విత్తనాలు తక్కువ ధరలకు ఇవ్వాలి అలాగే కన్నాయిగూడెం మండల, ఏఓ, ఏఈఓ,వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేస్తూ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి

# బోధన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్17(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నూతన పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్‌డీఓ భేటీ





**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 17(డీడీ9 వార్త) :**

బోధన్ శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా బుధవారం బోధన్ ఆర్‌డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డీఓ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా తయారీలో బూత్ స్థాయి ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని, ప్రతి పోలింగ్ కేంద్రానికి నిబంధనల ప్రకారం బి.ఎల్.ఏలను నియమించుకోవాలని సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్యుమరేషన్ ఫార్మ్‌లను ఏ విధంగా నింపాలో, క్షేత్రస్థాయిలో బి.ఎల్.ఏలు పాటించాల్సిన నియమ నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా సవరణలో అభ్యంతరాలు ఉంటే నిబంధనల ప్రకారం పరిష్కరించుకోవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆర్‌డీఓ కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఎంఈవో వెంకన్న హెచ్చరిక



**బీర్కూర్, జూన్ 17(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో మండల విద్యా శాఖ అధికారి (ఎంఈవో) వెంకన్న విద్యా శాఖ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు విరుద్ధంగా ఏ పాఠశాల యాజమాన్యం వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.విద్యార్థుల నుంచి నోట్‌బుక్స్, యూనిఫాంలు, అధిక ఫీజులు లేదా డొనేషన్లు బలవంతంగా వసూలు చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే చర్యలకు పాల్పడితే సంబంధిత పాఠశాలలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే విద్యా శాఖ నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన శిక్షలు విధించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించి, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని ఎంఈవో వెంకన్న సూచించారు.

## ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా పారిశుద్ధ్య పనులు

**బీర్కూర్, జూన్ 17(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా మురికి కాలువల శుభ్రత పనులు చేపడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చడం, వర్షాకాలంలో నీటి నిల్వలు, దోమల వ్యాప్తిని నివారించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో ఉన్న మురికి కాలువలను పూర్తిగా శుభ్రం చేసి, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను కాలువల్లో వేయకుండా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు లక్కపల్లి హనుమండ్లు, వడ్ల యాదవరావు, కారోబారి పర్వయ్య, సిబ్బంది పాల్గొన్నారు.





## చోరీ కేసు ఛేదించిన బీర్కూర్ పోలీసులు

- **నిందితుడి అరెస్ట్, బంగారం వెండి స్వాధీనం**

**బీర్కూర్, జూన్ 17(డిడి9 వార్త):**

బీర్కూర్ గ్రామానికి చెందిన వడ్ల రాజు నివాసంలో ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి జరిగిన చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి కొంత బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన ఎస్సై వీకే రాములు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ముమ్మర గాలింపు చర్యల ఫలితంగా నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు.బుధవారం నిందితుడి వద్ద నుంచి కొంత బంగారం, వెండి రికవరీ చేసి, పై అధికారుల ఆదేశాల మేరకు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వీకే రాములు తెలిపారు.



## నూతన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌కు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

**బీర్కూర్, జూన్ 17(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలానికి నూతనంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ బండి విజయ్‌ను బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మండలంలోని పశువులతో పాటు గ్రామాల్లో సంచరించే గోవులకు మెరుగైన వైద్య సేవలు అందించడం, పశువైద్య పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడం, పశు సంవర్ధక రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.డాక్టర్ బండి విజయ్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రైతులకు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్, సీనియర్ లయన్ సభ్యులు ఎం.ఏ. రషీద్, మేకల విఠల్, కిషోర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృ, శిశు మరణాల నివారణలో రాజీ పడొద్దు



- **బోధన్ జిల్లా ఆసుపత్రిలో 'మార్పు' కన్వర్జెన్స్ సమావేశం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 17(డీడీ9 వార్త) :**

గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కాకుండా, మాతృశిశు మరణాలను అరికట్టి సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా బోధన్ జిల్లా ఆసుపత్రిలో 'మార్పు' కన్వర్జెన్స్ సమావేశం బుధవారం జరిగింది. నిజామాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజశ్రీ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశానికి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస్, బోధన్ డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ విద్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గర్భిణీలకు అందజేసే ఏఎన్‌సీ సేవలను మరింత పటిష్టం చేయాలని, ప్రతి గర్భిణికి తప్పనిసరిగా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా అధిక ప్రమాద గర్భధారణ కలిగిన వారిని ముందుగానే గుర్తించి, వారికి ప్రత్యేక చికిత్స అందించేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రసవాల సమయంలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి నుండి జిల్లా ఆసుపత్రి వరకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆదేశించారు. ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచేందుకు వైద్యులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, ప్రభుత్వ మాతృశిశు ఆరోగ్య పథకాలను గర్భిణీలకు సకాలంలో అందేలా చూడాలని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మార్పు బృంద సభ్యులతో పాటు జిల్లా ఆసుపత్రి గైనకాలజిస్టులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కార్యాకర్త కుటుంబానికి పరామర్శ

**ఆదిలాబాద్ జిల్లా: తలమడుగు (డిడి వార్త న్యూస్) జూన్ 17**

తలమడుగు మండలం అర్లీ గ్రామానికి చెందిన తన అభిమాన కార్యకర్త నిమ్మల గజానన్ కుమార్తె ప్రమాదవశాత్తు గోడపైనుండి కింద పడటంతో కుడి కాలుకు గాయం అయి ఆస్పత్రి నుండి ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి గజానన్ కుమార్తె దివ్యని పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న బోత్ మాజీ ఎమ్మెల్యే టీఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర పరిశీలకులు రాథోడ్ బాబూరావు మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు ఆయన వెంట ముఖ్య నాయకులు నాగయ్య వెంకన్న భూమరెడ్డి రమేష్ గంగారాం గ్రామస్తులు మరియు యువకులు పాల్గొన్నారు



## బోధన్ లో సోషల్ టీచింగ్ డైరీ ఆవిష్కరణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 17(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో 'సోషల్ స్టడీస్ ఫోరమ్' ఆధ్వర్యంలో రూపొందించిన 'సోషల్ టీచింగ్ డైరీ'ని బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్ రెడ్డి, మండల విద్యాధికారి అంబెమ్ నాగయ్య హాజరై డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధనలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడానికి ఇటువంటి డైరీలు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. సోషల్ స్టడీస్ బోధనలో ఉపాధ్యాయులు సరికొత్త పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. పాఠశాల కాంప్లెక్స్ జీహెచ్‌ఎం పి. బాలచంద్రం మాట్లాడుతూ.. ఫోరమ్ చేపట్టిన ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ అధ్యక్షులు పాటల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎస్టీయూ అధ్యక్షులు నెమలి సంజీవ్ కుమార్, ఇతర ఉపాధ్యాయులు రాజన్న, శివయ్య తదితరులు పాల్గొన్నారు.






## ఆరోగ్యవంతమైన మాంసమే విక్రయించాలి: సర్పంచ్ ధర్మతేజ

**బీర్కూర్, జూన్ 17(డిడి9 వార్త):**

బీర్కూర్ మండల కేంద్రంలోని పశువైద్య ఆసుపత్రిలో పశువైద్యాధికారి డాక్టర్ విజయ్ ఆధ్వర్యంలో మాంసం విక్రయ దుకాణదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అరిగే ధర్మతేజ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యంగా ఉన్న మేకల మాంసాన్ని మాత్రమే విక్రయించాలని మాంసం దుకాణదారులకు సూచించారు. అనారోగ్యానికి గురైన లేదా నాణ్యత లేని మాంసాన్ని విక్రయించకుండా నిబంధనలు పాటించాలని కోరారు.పశువైద్యాధికారి డాక్టర్ విజయ్ మాట్లాడుతూ మాంసం విక్రయానికి ముందు పశువుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడం, పరిశుభ్రత ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఈవో గంగారం, మాంసం విక్రయ దుకాణదారులు హుస్సేన్, గణేష్, శంకర్, నర్సుజీ తదితరులు పాల్గొన్నారు

# హారర్ సినిమాతో భయపెట్టేందుకు సిద్ధమైన జాక్వెలిన్ ఫెర్నాండేజ్


బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్ ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల 'హౌస్‌ఫుల్ 5' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ప్రస్తుతం భారీ యాక్షన్ కామెడీ మూవీ 'వెల్కమ్ టూ ది జంగిల్' సినిమా షూటింగ్ పనుల్లో బిజీ అయిపోయారు. ఈక్రమంలో.. తాజాగా, జాక్వెలిన్ తన తదుపరి సినిమా కోసం ఓ ప్రయోగం చేయనున్నట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. తన కెరీర్‌లో ఇంతవరకు చేయని ఒక సరికొత్త జోనర్‌లోకి అడుగుపెట్టబోతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు గ్లామర్ పాత్రలు, కమర్షియల్ సినిమాలకే పరిమితమైన ఆమె ఇప్పుడు తన కెరీర్‌లోనే మొదటిసారిగా ఒక అవుట్-అండ్-అవుట్ ప్యూర్ హారర్ చిత్రంలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఖ్యాతి మదన్ నేతృత్వంలోని నాట్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఈ చిత్రం భారీ స్థాయిలో తెరకెక్కనుందట. పూర్తి స్థాయి భయానక వాతావరణంతో, బలమైన ఎమోషన్స్, మంచి సంగీతంతో సాగనుందని తెలుస్తోంది. జాక్వెలిన్ సరసన ఇద్దరు యంగ్ హీరోలు ముఖ్య పాత్రల్లో నటించనున్నారట. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఒక టీజర్, సాంగ్ షూట్ కూడా పూర్తయ్యాయని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం నటీనటులు వర్క్‌షాప్స్‌లో బిజీగా ఉండగా, జూన్ నెలాఖరు నుండి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభం కానుందట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ.. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్‌లు వైరల్ అవుతున్నాయి.



'ది కేరళ' స్టోరీ సినిమాతో దేశవ్యాప్తంగా ఫుల్ ఫేమ్ రాబట్టుకుని సంచలనం సృష్టించిన అదా శర్మ.. రూట్ మార్చి వివాదాస్పద చిత్రాలతో తన పాపులారిటీని పెంచుకుంటున్నారు. ఇటీవల 'గవర్నర్' మూవీతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం సూపర్ వెల్లి, ది గేమ్ ఆఫ్ గిర్గిట్, హటక్ వంటి థ్రిల్లర్ సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయారు. అయినప్పటికీ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరగా ఉంటున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, అదా శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో చిట్ చాట్ చేశారు. ఇందులో భాగంగా ఒక నెటిజన్ అదా శర్మను ఉద్దేశించి.. "మీరు మా ఫేవరెట్ నటి. మీ నటన ఎంతో సహజంగా, రియలిస్టిక్‌గా ఉంటుంది. మరి అలాంటప్పుడు మీరు మరాఠీ భాషలో 'కార్ల్ స్టోరీ', '1920', 'కొమ్డో' లాంటి శక్తివంతమైన సినిమాలు ఎందుకు చేయకూడదు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు అదా శర్మ క్రేజీగా సమాధానమిస్తూ.. ఒక పెద్ద హింట్ ఇచ్చారు. జూన్ 18న ఉదయం 10 గంటలకు ఒక బిగ్ సర్‌ప్రైజ్ రాబోతోందంటూ పిల్లి ఎమోజీలతో పాటు నవ్వుతున్న ఎమోజీలను జత చేశారు. దాంతో ఆమె మరాఠీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టబోతోందని, రేపు రాబోయే అప్‌డేట్ అదేనని ఫ్యాన్స్ గట్టిగా ఫిక్స్ అయిపోతున్నారు. మరికొందరు మాత్రం ఆమె నటించే సినిమాలకు సంబంధించిన అప్డేట్ అయి ఉండొచ్చని అంటున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో అదా శర్మ ఇవ్వబోయే ఆ సర్‌ప్రైజ్ ఏంటా అని నెటిజన్లు ఎంతో ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.



## శక్తివంతమైన సినిమాలు ఎందుకు చేయరని అడిగిన అభిమాని..



## పవన్ కల్యాణ్ నోట "OG2" మాట.. స్పెషల్ గెస్ట్ కూడా ఫిక్స్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఓజీ సినిమాకు మంచి రెస్పాన్స్ రావడంతో OG-2 ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఓజీ సినిమా వచ్చిన తరవాత దీనికి సీక్వెల్ కూడా ఉంటుదని ప్రచారం జరిగినా పవన్ కల్యాణ్ రాజకీయాల్లో ఫుల్ బిజీగా ఉండటంతో అసలు పార్ట్ 2 ఉంటుందా లేదా అనే ప్రశ్నలు మొదలయ్యాయి. దీంతో అభిమానులు కూడా అయోమయంలో పడ్డారు. అయితే తాజాగా హన్మకొండలోని తన అభిమాని నిరంజన్ ను పరామర్శించిన పవన్ కల్యాణ్ ఓజీపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఓజీ 2 అప్డేట్ గురించి నిరంజన్ పవన్ కల్యాణ్ ను ఎంతో ఆసక్తిగా ప్రశ్నించడంతో పవన్ స్పందించారు. నువ్వు ఏ మాత్రం అధైర్యపడకుండా చాలా త్వరగా కోలుకోవాలని అన్నారు.

ఒకవేళ నేను ఓజీ 2 తీస్తే దానికి స్పెషల్ గెస్ట్ నువ్వే అంటూ అభిమానికి పవన్ మాట ఇచ్చాడు. నిన్ను మేము ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని చెప్పాడు. పవన్ అలా చెప్పడంతోనే నిరంజన్ మురిసిపోయాడు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ నిరంజన్ ఇంటికి వెళ్లి పరామర్శించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే ఓజీ సినిమా 2025లో ప్రేక్షకుల ముందుకు రాగా ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్, శ్రీయారెడ్డి, ప్రకాష్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇక పవన్ అభిమానులకు బూస్ట్ ఇచ్చిన ఈ సినిమా పార్ట్ 2 వస్తే ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# శ్రీవిష్ణు 'కామ్రెడ్ కళ్యాణ్' మ్యూజికల్ జర్నీ షురూ.. ఫస్ట్ సింగిల్ అప్డేట్

వైవిధ్యమైన పాత్రలతో వరుస విజయాలతో దూసుకుపోతున్న శ్రీవిష్ణు నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'కామ్రెడ్ కళ్యాణ్'. జానకిరామ్ మారెళ్ళ దర్శకత్వంలో రాబోతుండగా.. ఇందులో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయె కీలక పాత్రలో కనిపించనున్నారు. 1992 సంవత్సరంలో ఆంధ్రఒడిశా సరిహద్దులోని విశాఖ జిల్లా మాడుగుల ప్రాంతం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో శ్రీవిష్ణు డబుల్ రోల్ చేయనున్నట్లు టాక్. వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్న ఈ సినిమాకు కొణ వెంకట్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇందులో పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండగా.. ఆయనకు వీరభిమానిగా శ్రీవిష్ణు కనిపించనున్నారు. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి మొదటి పాటను విడుదల చేసేందుకు మేకర్స్ ముహూర్తం ఖరారు చేశారు. జూన్ 20న కామ్రెడ్ కళ్యాణ్ ఫస్ట్ సింగిల్ 'ఒరియాపిల్ల'' సాంగ్ రాబోతున్నట్లు తెలుపుతూ.. ఓ క్రేజీ పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ పోస్టర్‌లో గుడిలో ప్రదక్షిణలు చేస్తున్న హీరోయిన్ మహిమా నంబియార్ చుట్టూ, హీరో శ్రీవిష్ణు దండం పెడుతూ ప్రేమగా చూస్తున్న విజువల్ ఎంతో ఆకట్టుకుంటోంది. ఈ పోస్ట్‌కు ''హద్దులు, అడ్డంకులు లేవు.. కేవలం ప్రేమ మాత్రమే'' అనే బ్యూటిఫుల్ క్యాప్షన్‌ను కూడా జత చేశారు.



## గొర్రెలా కాదు.. తోడేలులా జీవించాలి.. అంచనాలను పెంచుతున్న 'ఆల్ఫా' ట్రైలర్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్, శార్వరి వాఘ్, బాబీ డియోల్, అనిల్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హైవోల్టేజ్ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. బాలీవుడ్ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ తమ స్పై యూనివర్స్ నుండి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి శివ్ రావల్ దర్శకత్వం వహించగా, ఉదయ్ చోప్రా కథను అందించారు. ఈ మూవీలో అలియా భట్ అత్యంత కఠినమైన శిక్షణ పొందిన ప్రొఫెషనల్ కిల్లర్ 'సీత' పాత్రలో కనిపించారు. తనను పెంచి పెద్ద చేసిన మెంటారే.. ఆ తర్వాత శత్రువుగా బాబీ డియోల్ మారడంతో, అతడిని అంతం చేయడానికి సీత చేసే పోరాటమే ఈ సినిమా కథ. ఏక్ థా టైగర్, పఠాన్, వార్ సిరీస్ లాంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత YRF స్పై యూనివర్స్ నుండి వస్తున్న 7వ చిత్రమైన ఈ 'ఆల్ఫా'.. జులై 3న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ప్రమోషన్స్‌లో భాగంగా మూవీ మేకర్స్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

గ్లోబల్ టాప్ డీజే హ్యూజెల్ పాపులర్ ట్రాక్ 'జమైకన్ బామ్ బామ్' బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో ట్రైలర్ విజువల్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి. మరీ ముఖ్యంగా శార్వరి వాఘ్‌తో కలిసి ఆలియా భట్ చేసిన భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, హెవీ కాంబాయ్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. ట్రైలర్‌లో భారత దేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రొగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. ''గొర్రెలా కాదు.. తోడేలులా జీవించాలి'' అనే పవర్ ఫుల్ డైలాగ్ అంచనాలను పెంచుతోంది. ''ఈసారి లంకను తగలబెట్టడానికి సీత స్వయంగా వచ్చింది.. అగ్నిపరీక్ష మొదలు పెట్టండి'' అంటూ అలియా భట్ చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈ ట్రైలర్‌లో అందరికీ పెద్ద సర్‌ప్రైజ్ ఇస్తూ.. 'వార్' సినిమా నాటి 'కబీర్' పాత్రలో బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చి ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించారు.

## టాలీవుడ్‌లో గోల్డెన్ చాన్స్ దక్కించుకున్న ప్రీతి ముకుందన్..

కోలీవుడ్ యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ శ్రీవిష్ణు సూపర్ హిట్ చిత్రం 'ఓం భీమ్ బుష్' చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరచయం అయ్యారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'కన్నప్ప'లోనూ కీలక పాత్రలో నటించి మెప్పించారు. రీసెంట్‌గా 'బ్లాస్ట్' చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ కూతురిగా కనిపించి తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం ప్రీతి ముకుందన్ తెలుగు, తమిళ, మలయాళ ఇండస్ట్రీలో వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. తాజాగా, ఈ అమ్మడుకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు లక్కీగా చార్మింగ్ స్టార్ శర్వానంద్, డైరెక్టర్ శ్రీను వైట్ల కాంబోలో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రంలో హీరోయిన్‌గా గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుందని సమాచారం.



వైవిధ్యమైన పాత్రలు, తన క్యూట్ లుక్స్, నటనతో కుర్రకారు మనసులు దోచుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్‌లో భాగం కావడం విశేషం. సాధారణంగా శ్రీను వైట్ల సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు ఎంతో గ్లామరస్‌గా, బబ్లీగా ఉంటూనే.. కథలో చాలా కీలకంగా ఉంటాయి. అలాంటి ఒక ప్రాధాన్యత ఉన్న రోల్‌లో ప్రీతి ముకుందన్ ఎంపిక కావడం ఆమె కెరీర్‌కు టాలీవుడ్‌లో గట్టి పునాది వేస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం శర్వానంద్ తన 'భోగి' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. అది పూర్తయిన వెంటనే, వచ్చే ఆగస్టు నుండి ఈ క్రేజీ ఎంటర్‌టైనర్ సెట్స్‌పైకి వెళ్లనుందని టాక్.ఈ చిత్రానికి 'జార్జ్ క్రిష్' అనే టైటిల్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాలు కూడా పూర్తి చేసుకున్న ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500181. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502518.